నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
03.
27 డిసెంబర్ 2023
పేజీలు 8


### అంబేద్కర్ విగ్రహం

దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ వద్ద ఏప్రిల్ 14న అప్పటి సీఎం కేసీఆర్ అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్‌తో కలిసి అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ప్రారంభించారు. 100 టన్నుల కంచు, 360 టన్నుల ఇనుముతో 125 అడుగుల ఎత్తులో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

# అంతర్జాతీయం

### ఉత్తమ విమానాశ్రయంగా ఢిల్లీ

- అంతర్జాతీయ విమాన ప్రయాణ రేటింగ్ సంస్థ స్కైట్రాక్స్ 2020 నుంచి ఏటా విమానాశ్రయాలకు రేటింగ్ ఇస్తుంది. 50 దేశాలతో తాజా సర్వేను 2022 ఆగస్టు 2023 ఫిబ్రవరి మధ్య నిర్వహించి నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం దేశంలోనే కాకుండా దక్షిణాసియాలోనే ఉత్తమ విమానాశ్రయంగా ఢిల్లీ విమానాశ్రయం నిలిచింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా 50 విమానాశ్రయాల్లో ఢిల్లీ విమానాశ్రయం 36వ స్థానంలో నిలిచింది.



### ఛాంగి విమానాశ్రయానికి తొలి స్థానం

- విమాన ప్రయాణం తర్వాత ప్రయాణికులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ సంస్థ ఏటా ర్యాంకింగ్‌లు ఇస్తుంది. ఈ జాబితాలో సింగపూర్‌లోని ఛాంగి విమానాశ్రయం తొలి స్థానం దక్కించుకుంది.

### ఫిన్లాండ్ మొదటి స్థానం

- ప్రపంచంలో సంతోషకర దేశాల జాబితా 2023లో భారత్ 150 దేశాల్లో 125వ స్థానంలో నిలిచింది. ఐక్యరాజ్య సమితి 'సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్ నెట్‌వర్క్' వరల్డ్ హ్యాపినెస్ రిపోర్టును ఏటా విడుదల చేస్తుంది. తలసరి ఆదాయం, సామాజిక మద్దతు, ఆరోగ్యకర జీవన కాలపు అంచనా, స్వేచ్ఛ, దాతృత్వం, అవినీతి వంటి అంశాల ప్రమాణికంగా ఈ జాబితా తయారు చేస్తారు. ఫిన్‌లాండ్ ఈ జాబితాలో వరుసగా ఆరోసారి మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో డెన్మార్క్, మూడో స్థానంలో ఐస్‌ల్యాండ్ నిలిచాయి. రష్యా 72, ఉక్రెయిన్ 92వ స్థానాల్లో ఉన్నాయి.

### ప్రపంచ ప్రభుత్వ సదస్సు

- దుబాయ్‌లో ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు నిర్వహించారు. ఈ సదస్సు థీమ్ 'భవిష్యత్ ప్రభుత్వాల రూపకల్పన'. భవిష్యత్ ప్రభుత్వ పాలనను సమర్థవంతంగా తీర్చిదిద్దడానికి ప్రపంచవ్యాప్త దేశాల నిపుణులు సమావేశమై వివిధ విధానాలు సాంకేతిక పద్ధతులు, నమూనాల పరంగా చర్చలు జరిపే సమావేశం ఇది.




### 26 శాతం మందికి తాగునీరు దూరం

- 45 ఏళ్ల తర్వాత ఐక్యరాజ్య సమితి 2023, మార్చి 22-24 వరకు నిర్వహించిన ప్రపంచ జలవనరుల సదస్సులో 'ఐక్యరాజ్య సమితి ప్రపంచ జల అభివృద్ధి నివేదిక'ను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రపంచ జనాభాలో 26 శాతం మందికి స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. 46 శాతం మందికి కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో లేవు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఒకటి అయిన ప్రపంచమంతా శుద్ధ జలం, పారిశుద్ధ్య సౌకర్యాలను 2030 నాటికల్లా అందించాలనే ఆశయం నెరవేరాలంటే త్వరగా స్పందించి చర్యలు చేపట్టాలని, దీనికి 600 బిలియన్ డాలర్ల నుంచి ఒక ట్రిలియన్ డాలర్ల వరకు నిధులు అవసరమని ఐరాస పేర్కొంది.

### ఆపరేషన్ కావేరీ

- సూడాన్‌లో అంతర్గత అశాంతి నెలకొనడంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను వెనక్కి తీసుకొచ్చే 'ఆపరేషన్ కావేరీ'ని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 24 నుంచి మే 5 వరకు చేపట్టింది. దీనిలో భాగంగా పోర్ట్ సూడాన్ వద్ద INS సుమేధ నౌకను, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన C-130J విమానాన్ని వినియోగించారు.




### భారత్ ఎన్నిక

- ఐక్యరాజ్య సమితి అత్యున్నత గణాంకాల విభాగం 'యూఎన్ స్టాటిస్టికల్ కమిషన్'కు రెండు దశాబ్దాల అనంతరం భారత్ ఎన్నికైంది. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నిక జరిగింది. ఏప్రిల్‌లో ఈ ఎన్నిక జరిగినప్పటికీ భారత్ 2024, జనవరి 1 నుంచి నాలుగు సంవత్సరాల పాటు సేవలందిస్తుంది.

### 31వ సభ్య దేశంగా ఫిన్లాండ్

- ఐరోపా సమాఖ్యలోని దేశమైన ఫిన్లాండ్ నాటో సైనిక కూటమిలో 31వ సభ్య దేశంగా ఏప్రిల్ 4న చేరింది. ఫిన్లాండ్ చేరికకు చివరగా ఆమోదం తెలిపిన దేశం తుర్కియే.

### ఏనుగు జాతి డీఎన్‌ఏతో కృత్రిమ మాంసం

- ఆస్ట్రేలియా కంపెనీ 'వావ్' వందల ఏళ్ల క్రితమే అంతరించిపోయిన 'మమ్మత్' అనే భారీ ఏనుగు జాతి డీఎన్‌ఏ క్రమాన్ని ఉపయోగించి కృత్రిమ మాంసం మార్చిలో తయారు చేసింది. ఈ విధంగా తయారు చేసిన మీట్ బాల్‌ను నెదర్లాండ్స్‌లోని 'నెమో' సైన్స్ మ్యూజియంలో భద్రపరిచారు.

### క్షిపణి ప్రయోగాలు

- ఉత్తరకొరియా అణు సామర్థ్యం పెంచుకునేందుకు వరుసగా క్షిపణి ప్రయోగాలు చేపట్టింది. దీనిలో భాగంగా హసంగ్-18 ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్‌ను పరీక్షించింది.

### 'SS మాంటెవీడియో మారు' ఆచూకీ లభ్యం

- రెండో ప్రపంచ యుద్ధ కాలంలో వెయ్యి మందికి పైగా యుద్ధ ఖైదీలతో బయలుదేరి మునిగిపోయిన జపాన్ నౌక 'SS మాంటెవీడియో మారు' ఆచూకీ 81 ఏళ్ల తర్వాత ఏప్రిల్ నెలలో లభించింది. దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పీన్స్‌లోని లుజోన్ ద్వీప తీరంలో నాలుగు వేల మీటర్ల లోతులో ఈ నౌక ఆచూకీని కనుగొన్నారు.

### మీడియా స్వేచ్ఛా సూచీలో 161వ స్థానం

- ప్రపంచ మీడియా స్వేచ్ఛా దినోత్సవ సందర్భంగా ఏటా 'రిపోర్టర్స్ వితవుట్ బోర్డర్స్' అనే గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్ ప్రపంచ మీడియా స్వేచ్ఛా సూచీని ప్రచురిస్తుంది. ఈ ఏడాది ఈ సంస్థ ప్రచురించిన ప్రపంచ మీడియా స్వేచ్ఛా సూచీ-2023లో భారత్ 161వ స్థానంలో ఉంది. గతేడాది ఉన్న 150వ స్థానం కంటే 11 స్థానాలు దిగువకు పడిపోయింది. మొత్తం 180 దేశాలకు సంబంధించి ఈ సంస్థ ర్యాంకులు ఇస్తుంది. ఈ సూచీలో నార్వే, ఐర్లాండ్, డెన్మార్క్ తొలి మూడు స్థానాల్లో ఉండగా వియత్నాం, చైనా, ఉత్తరకొరియా చివరి మూడు స్థానాల్లో ఉన్నాయి.

### జీ-7 దేశాల సమావేశాలు

- జపాన్‌లోని హిరోషిమా నగరంలో మే 19 నుంచి 20 వరకు జీ-7 దేశాల శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి. జపాన్ ప్రధాని ఆహ్వానం మేరకు భారత ప్రధాని మోదీ కూడా ఈ సమావేశాలకు హాజరయ్యారు.




### సముద్ర శక్తి విన్యాసాలు

- భారత్-ఇండోనేషియా మధ్య ద్వైపాక్షిక 'సముద్ర శక్తి విన్యాసాలు' (నాలుగో ఎడిషన్) మే 17-19 వరకు ఇండోనేషియాలోని బాటమ్ తీరంలో జరిగాయి.

2వ పేజీ తరువాయి

### విదేశీ న్యాయవాదులు, సంస్థలు

- భారత న్యాయస్థానాల్లో విదేశీ న్యాయవాదులు, న్యాయ సంస్థలు ప్రాక్టీస్ చేసుకునేందుకు అనుమతించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) మే 15న నిర్ణయించింది. దీని ప్రకారం విదేశీ చట్టాలు అంతర్జాతీయ న్యాయసమస్యలు, మధ్యవర్తిత్వ వ్యవహారాల్లో విదేశీ న్యాయవాదులను అనుమతించనున్నారు. దీనికోసం భారత్‌లో న్యాయ సంస్థల రిజిస్ట్రేషన్, నియంత్రణకు బీసీఐ కొత్త నిబంధనలు నోటిఫై చేసింది.




### బడ్జెట్

- 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను 2023 ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. మొత్తం బడ్జెట్ వ్యయం రూ.45 లక్షల కోట్లు. ఈ బడ్జెట్ ఇస్తున్న 7 ప్రాధాన్యతలను 'సప్తరిషి'గా పేర్కొంది. ఆ 7 ప్రాధాన్యతలు.. సమ్మిళిత అభివృద్ధి, చిట్టచివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందడం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల పూర్తి సామర్థ్య వినియోగం, గ్రీన్ గ్రోత్, యువశక్తి సద్వినియోగం, ఆర్థిక రంగ పటిష్టత.

### పశు సంవర్ధక శాఖ గణాంకాలు-2022

- పశుసంవర్ధక శాఖ ప్రాథమిక గణాంకాలు 2022ను 2023, మార్చిలో విడుదల చేశారు. ఈ గణాంకాల ప్రకారం గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ తొలిస్థానంలో, తెలంగాణ 3వ స్థానంలో నిలిచాయి. 2021-22 మధ్య దేశంలో పాల ఉత్పత్తి 221.06 మిలియన్ టన్నులకు చేరి 5.29 శాతం వార్షిక వృద్ధి చూపింది. పాల ఉత్పత్తిలో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రదేశ్ వరుసగా 5 స్థానాల్లో నిలిచాయి.

### జమ్ముకశ్మీర్‌లో పెట్టుబడి

- జమ్ముకశ్మీర్‌కు తొలి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దుబాయ్‌కు చెందిన ఎమ్మార్ గ్రూప్ ద్వారా (రూ.500 కోట్లు) లభించింది. ఆర్టికల్ 370 రద్దయిన తర్వాత వచ్చిన మొట్టమొదటి ఎఫ్‌డీఐ ఇది. ఎమ్మార్ సంస్థ గతంలో బుర్జ్‌ఖలీఫా, దుబాయ్ మాల్ వంటి ప్రపంచ ప్రసిద్ధ నిర్మాణాలు చేపట్టింది.

### అద్భుత ప్రాంతాలు

- టైమ్ అద్భుత ప్రాంతాల జాబితా-2023ను టైమ్ మ్యాగజైన్ విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 50 అద్భుత ప్రాంతాలతో రూపొందించిన ఈ జాబితాలో లడఖ్, మయూర్‌భంజ్‌లకు చోటు దక్కింది. మయూర్‌భంజ్‌లో అరుదైన నల్ల పులి, పురాతన ఆలయాలు, సాంస్కృతిక వైభవం ఆకర్షణగా ఉండగా, లడఖ్ మంచు కొండలు, బౌద్ధారామాలు, అక్కడి వాతావరణం ఆకర్షణగా ఉన్నాయి.

### జియోట్యాగ్

- 2022-23కు దేశవ్యాప్తంగా అత్యధిక (5) జియోట్యాగ్‌లు సాధించిన రాష్ట్రంగా కేరళ మొదటి స్థానంలో నిలిచింది. కేరళకు చెందిన బీన్స్, కందిపప్పు, నువ్వులు, వెల్లుల్లి, కర్బూజాలకు జాగ్రఫికల్ ఇండికేషన్ ట్యాగ్ (జీఐ) 2022-23కు లభించింది.

### యాపిల్ స్టోర్

- ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ మాల్‌లో ఏప్రిల్ 18న యాపిల్ సంస్థ భారత్‌లో తన తొలి రిటైల్ స్టోర్‌ను ప్రారంభించింది.

### 3డీ పోస్టాఫీస్

- దేశంలోనే తొలిసారి 3డీ ప్రింటెడ్ టెక్నాలజీతో బెంగళూరులోని కేంబ్రిడ్జి లేఅవుట్‌లో ఎల్ అండ్ టీ కంపెనీ పోస్టాఫీస్‌ను నిర్మించింది.

### కొత్త కప్పజాతి

- ఒక కొత్త కప్పజాతిని భారత సైంటిస్టులు మేఘాలయలోని సౌత్ గారోహిల్స్ జిల్లాలోని సిజు గుహలో కనుగొన్నారు. ఇది కాసేడ్ రానిడ్ జాతికి చెందింది. దీన్ని కనుగొన్న గుహ పేరును కలిపి ఈ కప్పకు 'అమోలోప్స్ సిజు' అని పేరు పెట్టారు.

### బిహు

- అసోం రాష్ట్ర సంప్రదాయ నృత్యం 'బిహు' గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించింది. గువాహటిలోని సరుసజై స్టేడియంలో ఒక వేదికపై 11,298 మంది కళాకారులు, నృత్యకారులు బిహు నృత్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డు సృష్టించారు. అసోం సాంస్కృతిక వారసత్వానికి ప్రపంచ గుర్తింపు తెచ్చే లక్ష్యంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 14న నిర్వహించింది.



### సంగఠన్ సే సమృద్ధి

- కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి గిరిరాజ్ సింగ్ ఏప్రిల్ 18న 'సంగఠన్ సే సమృద్ధి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తద్వారా గ్రామీణ అట్టడుగు కుటుంబాలకు సాధికారత కల్పించనున్నారు. అర్హులైన గ్రామీణ మహిళలందరికీ స్వయం సహాయక బృందాల్లోకి ప్రవేశం కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం.

### మోచా

- బంగ్లాదేశ్, మయన్మార్ తీర ప్రాంతాలను తీవ్రంగా ప్రభావితం చేసిన తుఫాన్ మేలో బంగాళాఖాతంలో ఏర్పడింది. దీనికి 'మోచా' అనే పేరును యెమెన్ సూచించింది. మోచా అంటే యెమెన్‌లోని ఒక చిన్న మత్స్యకార గ్రామం.

### జాతీయ పార్టీ హోదా

- కేంద్ర ఎన్నికల సంఘం ఏప్రిల్ 10న ఆమ్ ఆద్మీ పార్టీకి జాతీయ పార్టీ హోదా కల్పించింది. మరికొన్ని పార్టీలకు జాతీయ హోదా తీసివేసింది. ఇప్పటివరకు జాతీయ పార్టీలుగా ఉన్న ఎన్‌సీపీ, తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు ఆ హోదాను తొలగించింది. ప్రస్తుతం దేశంలో జాతీయ పార్టీ హోదా కలిగిన పార్టీలు 6 ఉన్నాయి. అవి.. కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, బీఎస్పీ, ఎన్‌సీపీ, ఆప్.

### కేశవానంద భారతి తీర్పు

- కేశవానంద భారతి తీర్పు వెలువడి 50 ఏండ్లు పూర్తవడంతో ఆ కేసు తీర్పు వివరాలతో సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఒక ప్రత్యేక వెబ్‌పేజీని ఏప్రిల్‌లో ఏర్పాటు చేసింది. ఈ కేసు విచారణకు 13 మంది సభ్యులతో ధర్మాసనం ఏర్పాటైంది. ఇంతవరకు ఒక కేసు విచారణకు ఏర్పాటైన రాజ్యాంగ ధర్మాసనాల్లో ఇదే పెద్దది. ఈ కేసులో పలు అంశాలతో పాటు రాజ్యాంగ మౌలిక స్వరూపం గురించి స్పష్టంగా చర్చించడంతో ఈ తీర్పు ఎంతో ప్రాముఖ్యం కలిగింది.

### లిథియం నిక్షేపాలు

- రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో భారీగా లిథియం నిక్షేపాలను గుర్తించారు. ఈ అరుదైన ఖనిజాన్ని దేశంలో తొలిసారి జమ్ముకశ్మీర్‌లో గుర్తించారు. ప్రస్తుతం గుర్తించిన నిల్వలు పెద్ద ఎత్తున ఉన్నాయి. దేశ అవసరాల్లో 80 శాతం వరకు తీరుస్తాయని అంచనా. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, సెల్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్ వంటి గ్యాడ్జెట్ల బ్యాటరీల్లో దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

### కొచ్చి వాటర్ మెట్రో

- దేశంలో తొలిసారి నీటిపై నడిచే మెట్రో సర్వీస్ (ఫెర్రీ ట్రాన్స్‌పోర్ట్) కేరళలోని 'కొచ్చి వాటర్ మెట్రో (కేడబ్ల్యూఎం)' చరిత్ర సృష్టించింది. దక్షిణాసియాలో తొలి వాటర్ మెట్రో అయిన కేడబ్ల్యూఎం కొచ్చిన్ చుట్టుపక్కలగల 10 ద్వీపాలను కలుపుతూ ఎలక్ట్రిక్ హైబ్రిడ్ బోట్ల ద్వారా గంటకు 15 నుంచి 22 కిలోమీటర్ల వేగంతో ఈ మెట్రో సర్వీస్ నడుస్తుంది. జర్మనీకి చెందిన ఫండింగ్ సంస్థ కేఎఫ్‌డబ్ల్యూ, కేరళ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి. ఈ ప్రాజెక్టును ప్రధాని ఏప్రిల్ 25న జాతికి అంకితం చేశారు.

